సాక్షి తిరుపతి

సోమవారం । 13 । మే । 2024



ఓటేద్దాం రండి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉంది.

- 8లో



పుష్పాభిషేకం

శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం పుష్పయాగ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

- 8లో



ఆకర్షిస్తున్న పోలింగ్ కేంద్రాలు

తిరుపతిలో పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ఆకట్టుకుంటున్నాయి. బెలూన్లు, రకరకాల షామియానాలు ఏర్పాటు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

పొరబాట్లకు తావివ్వొద్దు



తిరుపతిలోని ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా పొరబాట్లకు తావివ్వొద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన జిల్లాలోని అన్ని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈవీఎంల పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని స్కిట్‌కళాశాలలోని ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లాలో 2,140 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 690 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూ ఏటీసీ సర్కిల్ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 76,945 మంది స్వామివారిని దర్శించుకోగా 33,844 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు ఎస్వీ జూకు సెలవు

తిరుపతి మంగళం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతుప్రదర్శనశాల(ఎస్వీ జూపార్క్)కు సెలవు ప్రకటించారు. సోమవారం ఎన్నికల పోలింగ్ దృష్ట్యా జూలోకి సందర్శకుల అనుమతి లేదని జూ క్యూరేటర్ సెల్వం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి యథావిధిగా జూ సందర్శన ఉంటుందని తెలిపారు.

బస్..రష్



తిరుపతి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్: ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీ సర్వీసులు రద్దీగా మారాయి. జిల్లాలో 905 ఆర్టీసీ బస్సులుండగా.. అందులో 505 సర్వీసులను ఎలక్షన్‌కు కేటాయించారు. మిగిలిన 400 బస్సుల్లో 250 బస్సులు తిరుపతి–తిరుమలకు నడుస్తున్నాయి. మిగిలిన 150 బస్సులు మాత్రమే జిల్లాలో నడుస్తున్నాయి. బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస లొచ్చిన వారంతా తమ ఓటు గ్రామీణ ప్రాంతాల్లో ఉండడంతో ఆ ప్రాంతాలకు ఓటు వేయడానికి క్యూకట్టారు. ఈ క్రమంలో ఆర్టీసీ సర్వీసులు అవసరం మేరకు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. ఇదేఅదునుగా ప్రైవేటు వాహనదారులు రెట్టింపు ధరలకు ప్రయాణికులను దోచుకునేపనిలో పడ్డారు.

● నా ఓటు నా భవిష్యత్తు



చిల్లకూరు : మండలంలోని ఏరూరు సమీపం సముద్రం వద్ద అదే గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ 'నా ఓటు నా భవిష్యత్' స్లోగన్‌తో సైకత శిల్పాన్ని రూపొందించారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఐదేళ్లు.. ఎన్నో మేళ్లు



తిరుపతి జిల్లా పాకాల మండలం, అచ్చమ్మఅగ్రహారం పాఠశాలలో గతంలో పరిస్థితి



తిరుపతి జిల్లా, పాకాల మండలం, అచ్చమ్మఅగ్రహారం పాఠశాలలో నేడు పరిస్థితి

సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసేందుకు దేశవిదేశాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఉద్యోగం.. ఉపాధి కోసం ఎక్కడెక్కడో స్థిరపడిన వారు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత ప్రాంతానికి చేరుకున్నారు. ఈ ఐదేళ్లలో మారిన తమ ఊర్ల రూపురేఖలను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ ఇంతటి అభివృద్ధిని చూడలేదని హర్షాతిరేకాలు వెలిబుచ్చుతున్నారు. తాము చదివిన బడి ఇప్పుడు కార్పొరేట్ హంగులతో కనువిందు చేయడంపై ఆనందపడుతున్నారు. పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలు ఆర్థికంగా పుంజుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సకల సేవలను ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన ప్రభుత్వ పనితీరుపై అభినందనలు కురిపిస్తున్నారు.

అభివృద్ధి అమోఘం

- ఎన్నికల వేళ సొంతూరికి వచ్చిన స్థానిక ఓటర్లు
- మారిన ఊర్లను చూసి ఆశ్చర్యం
- తాము చదివిన బడిని చూసి ఆనందం
- ఇది కదా అభివృద్ధి అంటూ అభినందనలు
- మేలు చేసిన వారికే ఓటేస్తామని స్పష్టీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : కోవిడ్ మహమ్మారి మూడేళ్ల పాటు జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఆ వైరస్ దెబ్బకు ప్రజలు భీతిల్లిపోయారు. ఇంటికి వచ్చి తమ తల్లిదండ్రులను చూసుకుందామని విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాల కోసం వెళ్లిన పిల్లలు అనుకున్నప్పటికీ సొంత గ్రామాలకు రాలేని పరిస్థితి. అలాంటి విపత్కర వేళలో ప్రస్తుత సర్కారు సహాయక చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా క్వారంటైన్‌లు ఏర్పాటు చేసింది. 35,67,999 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించింది. పాజిటివ్ కేసులకు ఆర్థిక సహాయం చేసింది. కోవిడ్ సెంటర్ల నిర్వహణకు రూ.53.8 కోట్లు వెచ్చించింది. వైద్యసిబ్బంది కోసం 20 కోట్లు ఖర్చు చేసింది. యుద్ధప్రాతిపదిక కోవిడ్ వ్యాక్సినేషన్ పూర్తి చేయించింది.ఈ క్రమంలోనే పకడ్బందీగా సంక్షేమ పథకాలు అమలు చేసింది. ఈ ఐదేళ్లలో చిత్తూరు జిల్లావ్యాప్తంగా 28,13,013 మందికి రూ.8,635.23 కోట్లు, నాన్ డీబీటీ పద్ధతిలో 5,78,015 మందికి 2,750.71 కోట్లు ఖర్చు చేసింది. తిరుపతి జిల్లాల్లో 28,50,798 మందికి డీబీటీ పద్ధతిలో 8,552.69 కోట్లు, నాన్ డీబీటీ పద్ధతిలో 34,49,551 మందికి రూ.3,401.89 కోట్లు వెచ్చించింది.

బడులు మారిపోయాయ్!

ఓట్ల పండుగకు గ్రామాలకు విచ్చేసిన వారు గతంలో తాము చదివిన బడులను చూసి సర్కారు పాఠశాలలు ఇంతలా మారాయా అని ముక్కున వేలేసుకుంటున్నారు. తాము చదివే రోజుల్లో ఎలాంటి సౌకర్యాల్లేవని వారు వెల్లడిస్తున్నారు. అప్పట్లో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే ఇలాంటి వసతులు ఉండేవని గుర్తుచేసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి పిల్లలకు సర్కారు బడుల్లో ఉచితంగా కార్పొరేట్ విద్యను అందివ్వడం గొప్ప విషయమని ప్రశంసిస్తున్నారు.



టీడీపీ పాలనలో అధ్వానంగా ఉన్న ముడిపల్లి దళితవాడలోని పాఠశాల



ప్రస్తుత ప్రభుత్వంలో రూపురేఖలు మారిన ముడిపల్లి దళితవాడలోని పాఠశాల

వలంటీర్ల సేవలు బాగున్నాయ్!

కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీలతో సంబంధం లేకుండా ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడం అద్భుతమని వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో తమ తల్లిదండ్రులను కంటికి రెప్పలా వలంటీర్లు కాపాడారని ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇక్కడి ఓటర్లు వెల్లడిస్తున్నారు.ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వలంటీర్ వ్యవస్థను తీసుకురావడంపై అభినందనలు కురిపిస్తున్నారు. ఇలాంటి విప్లవాత్మకమైన పథకాలతో అండగా నిలిచిన వారికే తమ మద్దతని స్పష్టం చేస్తున్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు చక్కగున్నాయ్!

ఇంటి వద్దకే వైద్యమా ఇలాంటి సౌకర్యం ఎక్కడా లేదే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విదేశాల్లో సైతం ఇలాంటి సౌకర్యం లేదని వెల్లడిస్తున్నారు. గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళితే కనీసం మందులు కూడా ఉండేవి కావని, ఇప్పుడు ఇంటికే ఫ్యామిలీ కాన్సెప్ట్ కింద వైద్యులు వస్తున్నారని వివరిస్తున్నారు. ఇంత మేలు చేసిన ప్రస్తుతం ప్రభుత్వ పనితీరు ప్రశంసనీయమని, పేదలకు ఇలాంటి పాలకులే కావాలని స్పష్టం చేస్తున్నారు.

తిరుపతి జిల్లాలో సంక్షేమ సమాచారం

మొత్తం జనాభా	20,05,942
కుటుంబాలు	7,09,483
లబ్ధిపొందిన ఫ్యామిలీలు	6,33,898
మేలు చేకూరిన వారు	10,34,611
డీబీటీలో ఖర్చు చేసిన మొత్తం	రూ.8,552.69 కోట్లు
నాన్ డీబీటీలో వెచ్చించి మొత్తం	రూ.3,401.89 కోట్లు



టీడీపీ పాలనలో నాణ్యతలేని డస్క్‌లు



ప్రస్తుత ప్రభుత్వంలో నాణ్యమైన డస్క్‌లు

కరోనా నుంచి కాపాడారు



ఈ ప్రభుత్వం కరోనా మహమ్మారి నుంచి మా ప్రాణాలను కాపాడింది. నా భర్త వికలాంగుడు కావడంతో నేను ఓ ప్రైవేటు కళాశాలలో దినసరి కూలీగా పనిచేస్తూ, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాను. రోజూ కూలీ పనికి పోతేగాని పూటగడవని పరిస్థితి. అలాంటి సమయంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందడంతో లాక్‌డౌన్ విధించారు. ముగ్గురు పిల్లలు, భర్తను ఎలా పోషించుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. అటువంటి సమయంలో ఈ ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. మేము ఉన్నామంటూ భుజం తట్టి భరోసా ఇచ్చింది. నిత్యావసర సరుకులు, మందులు, కోడిగుడ్లు, ఆర్థిక సాయం అందిస్తూ మా ప్రాణాలను కాపాడింది. ఇక బతకలేము అనుకున్న సమయంలో మాకు తోడుగా నిలిచిన ఈ ప్రభుత్వానికి ఏమిచ్చి రుణం తీర్చుకోవాలి. విపత్కర సమయంలోనూ సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అందిస్తూ మాకు ఆర్థిక భరోసాను కల్పించిన ఈ ప్రభుత్వాన్ని జీవితంలో మురువలేము.

– కే.నీలా, కొటాల, దళితవాడ, చంద్రగిరి మండలం

మా మంచి కోరిన వారికే మద్దతు



మా మంచి కోరిన వారికే మద్దతు ఉంటుంది. ప్రతి సంక్షేమ పథకం ఇంటి వద్దకే వచ్చి మాకు అన్ని విధాలుగా ప్రస్తుత ప్రభుత్వం అండగా నిలిచింది. సకాలంలో రైతులను ఆదుకోవడంతో పాటు విద్యావ్యవస్థలో సమూల మార్పులను తీసుకొచ్చింది. ఇంటి వద్దకే వైద్యాధికారులు వచ్చి మా బాగోగులు చూస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని కోరుకుంటున్నా. మనం ఐదు నిమిషాల్లో వేసే ఓటు, మన ఐదేళ్ల భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి.

– ఆనంద్, అరిగెలవారిపల్లి, పనపాకం పంచాయతీ, చంద్రగిరి మండలం

మానవత్వం చాటుకున్న ప్రభుత్వమిది



కరోనా కష్ట కాలంలో ప్రభుత్వం చూపిన మానవత్వం ప్రజల మన్ననలు చూరగొంది. రెండేళ్లు ఆర్థిక ఇబ్బందులు కలిగినా సంక్షేమాన్ని 100 శాతం అమలు చేసింది. కరోనాను సాకుగా చూపి సంక్షేమాన్ని ఆపలేదు. నిత్యావసరకులు, మందులు ఆర్థిక సహాయాన్ని సైతం నేరుగా ఇంటికే పంపించారు. ప్రభుత్వం చూపిన చొరవ, అవగాహనతో లక్షలాది మందికి ప్రభుత్వ సహాయ, సహకారాలు అందాయి. సకాలంలో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు, వ్యాక్సిన్లు, మందులు అందుబాటులో ఉంచడం వల్ల వేలాది మంది ప్రాణాలు కాపాడి, ప్రాణభిక్ష పెట్టారు.

– డీ.లక్ష్మయ్య, బీసీ సంఘ నాయకుడు

అభివృద్ధిలో 49 ఏళ్లు ముందుకు



ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధితో తిరుపతి మరో 49 ఎళ్లు ముందుకు వెళ్లింది. అభివృద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపించారు. గత పాలకులు తిరుపతికి వచ్చిన ప్రతిసారీ గ్రీన్ సిటీ, మెడికల్ హబ్, హెల్త్ హబ్, ఐటీ హబ్.. ఇలా నోటికొచ్చిన పేర్లతో అభివృద్ధి చేస్తానని మాయ మాటలు చెప్పి వెళ్లారు. కానీ ఏ ఒక్కటీ అమలు కాలేదు. గడిచిన ఐదేళ్లలో తిరుపతిలో వందలాది కోట్లతో అభివృద్ధి చేశారు. అభివృద్ధి ఫలాలను నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారు. రోడ్లు, యూడీఎస్, కాలువలు, డ్రైన్లు ఇతర మౌలిక వసతుల కల్పన, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌పరంగా ఇప్పుడు జరిగిన అభివృద్ధి గతంలో ఎప్పుడూ జరగలేదు. తిరుపతి భవిష్యత్తుపై అవగాహన ఉన్న మంచి నాయకున్ని ఎన్నుకుందాం.

– టీ.దాసు, దళిత సంఘ నాయకుడు

ప్రాణాలు కాపాడింది



కరోనా బారిన పడినప్పుడు కుటుంబ సభ్యులు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. అలాంటి కష్ట సమయాల్లో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, పేదల ప్రాణాలు కాపాడింది. కరోనా బాధితులు గడప దాటకుండానే వలంటీర్లు, వైద్య సిబ్బందిని ఇంటికే పంపించింది. అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించింది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉటాం.

– గూటూరు హాజరత్, ఎస్ఎస్ఆర్ కాలనీ, నాయుడుపేట

ఓటుతో కడిగేస్తాం



ప్రతి ఒక్కరూ ఓటు హక్కుని వినియోగించుకుని కుళ్లు రాజకీయాలను కడిగేయాలి. యువతకు, ప్రజలకు మేలు చేసే నాయకులను ఎన్నుకోవాలి. రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని చెప్పిన మాట.. నిరుపేదల సంక్షేమం కోసం.. పాటుపడే మంచి నాయకున్ని ఎన్నుకునే తరుణం వచ్చింది. అందరూ సన్నద్ధం కండి.

– ఆవుల శరణ్య, విద్యార్థిని, సైదాపురం

మా పాఠశాలను చూస్తే ఆశ్చర్యమేస్తోంది



నేను మొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నాను. మా అమ్మ ప్రోత్సాహంతో కష్టపడి నేను ఇప్పుడు డిగ్రీ చదువుతున్నాను. గతంలో మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే నా చదువు సాగింది. గత ప్రభుత్వ హయాంలో మా పాఠశాల చాలా దుర్భరంగా ఉండేది. కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. అయితే ప్రస్తుత ప్రభుత్వం మా పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దింది. ఆహ్లాదకరమైన వాతావరణం, మినరల్ వాటర్, క్లాస్ రూంలో బెంచీలు, డిజిటల్ క్లాసులు, ఇంగ్లిష్ మీడియం ఇలా ఒకటేమిటి అనేక విధాలుగా అభివృద్ధి కళ్లెదుటే కనిపిస్తోంది. మా గ్రామంతో పాటు పాఠశాలను అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలనుకుంటున్నాను.

– మౌనిక, కొటాల, చంద్రగిరి మండలం

ఓటింగ్ శాతం తగ్గించే కుట్ర!

- ఓటర్లను భయభ్రాంతులకు గురుచేసేందుకు ఎల్లో మీడియా భారీ స్కెచ్
- నేడు సోషియల్ మీడియా, టీవీల వేదికగా అసత్య ప్రచారాలు చేసే అవకాశం
- పాస్‌లు లేనివారిని పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని ఎస్పీకి వినతి
- ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారమే నడుచుకోవాలంటున్న ఎస్పీ



సాక్షి, తిరుపతి: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఎల్లోమీడియా భారీ స్కెచ్ వేసింది. కుట్రలో భాగంగా సోమవారం పోలింగ్ రోజున సోషియల్ మీడియా, టీవీ షోషల్ మీడియాల్లో పెద్ద ఎత్తున అసత్య ప్రచారాలు చేసేందుకు ప్రణాళిక రచించింది. ఈ మేరకు వారి యాజమాన్యాల నుంచి కూటమి నాయకులకు, ఎల్లో మీడియా ప్రతినిధులకు పక్కా ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ఎవరు భయపెట్టినా బయపడాల్సిన పనిలేదని.. స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశించే యత్నం

ఎన్నికల నిబంధనల ప్రకారం ఇప్పటికే అధికారుల అనుమతి పొంది పాస్‌లు ఉన్న వారికి మాత్రమే పోలింగ్ కేంద్రాల పరిసరాల్లోకి మీడియాను అనుమతిస్తారు. కానీ మీడియా పాస్‌లు లేకపోయినా పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించి అల్లర్లు సృష్టించేందుకు ఎల్లోమీడియా ప్రతినిధులు, సిబ్బంది యతి్నంచనున్నట్లు తెలుస్తోంది. కుట్రలో భాగంగానే పాస్‌లు లేని వారిని సైతం పోలింగ్ కేంద్రాలలోకి అనుమతించాలని ఆదివారం జిల్లా ఎస్పీని కలిసి విన్నవించడం దీనికి మరింత బలాన్ని చేకూర్చుతోంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

'ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి మీడియా పాత్రపై ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశాలు జారీచేసింది. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రతి మీడియా ప్రతినిధులకు కచ్చితంగా ఎన్నికల అధికారి ఇప్పటికే పాస్‌లు జారీచేసి ఉంటారు' అని ఎస్పీ ఎల్లో మీడియాకు తెలియజేశారు. పాస్‌లు లేకుంటే ఎట్టిపరిస్థితిలో పోలింగ్ కేంద్రాలలోకి అనుమతించమని, ఇందులో ఎటువంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని ఎల్లో మీడియాకు తేల్చిచెప్పినట్టు సమాచారం.

అసత్యాల ఫోకస్‌పైనే దృష్టి

గత ఏడాది నుంచి ప్రభుత్వంపైనా, అధికారులపైనా విషం చిమ్ముతున్న ఎల్లో మీడియా పోలింగ్ రోజు సోమవారం జిల్లాలో ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పోలింగ్ కేంద్రాలలో వైఎస్సార్‌సీపీ దౌర్జన్యాలు చేస్తోందంటూ సోషల్ మీడియా, వారి అనుకూల టీవీ చానల్స్‌లో కల్పిత వీడియోలు, అసత్యాలు ప్రచారం చేసేందుకు సన్నద్ధమైంది. ఎలాగైనా ఓటర్లను ఇంటి నుంచి బయటకు రానియ్యకుండా చేసేందుకు ప్రయత్నించడంతో పాటు, పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు స్కెచ్ వేసింది. మీడియా పేరుతో పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించాలనే ఆలోచనతో ఎల్లో మీడియా ఉన్నట్లు సమాచారం.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట భద్రత

- 4,500 మంది పోలీసులు, కేంద్ర బలగాలతో నిఘా
- 286 రూటు మొబైల్ పార్టీలతో గస్తీ
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు
- ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్



ఎన్నికల విధులపై పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైమ్: రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పటిష్ట భద్రత నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 4500 మంది పోలీసులు కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పూర్తి భద్రత మధ్య ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. భద్రత కోసం కేంద్ర బలగాలు, ఇతర రాష్ట్రాల నుంచి పోలీస్ సిబ్బంది జిల్లాకు వచ్చారన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించామని ఆ ప్రాంతాల్లో మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తూ.. పూర్తి భద్రత చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న ఆంక్షలను పక్కాగా అమలు చేస్తామని ఓటర్లు తప్పనిసరిగా 100 మీటర్ల దూరంలోనే ఉండాలన్నారు. కేవలం ఓటు హక్కు వినియోగించుకునే వారు మాత్రమే వారు ఓటు హక్కును వినియోగించుకుని వెళ్లాలన్నారు.

286 రూటు మొబైల్ పార్టీలతో గస్తీ

286 రూట్ మొబైల్ పార్టీతో గస్తీ నిర్వహిస్తున్నట్లుగా ఎస్పీ పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చెక్‌పోస్టుల వద్ద కూడా అదనపు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ముందురోజు నుంచే 144 సెక్షన్ అమల్లో ఉంచామని తెలిపారు. శాంతి భద్రతలకు విగాతం కలిగితే సహించేది లేదని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గత ఎన్నికల్లో తీసుకున్న విధివిధానాలను పరిశీలించి ఈ ఎన్నికల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలు పారదర్శకంగా సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

సమస్య ఉంటే తక్షణమే ఫిర్యాదు చేయండి

పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా సమస్యలు తలెత్తిన అతిక్రమణలకు పాల్పడిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రజలంతా కూడా ఇలాంటి సంఘటనలు చూసిన సమయంలో డయల్ 100, పోలీస్ వాట్సాప్ నంబర్ 8099999977 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తిరుపతి జిల్లా పరిధిలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ పరిశీలించారు. ఎస్వీ యూనివర్సిటీ, ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అక్కడి పరిస్థితులను పరిశీలించిన ఎస్పీ అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడారు.

క్లుప్తంగా

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ.వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు జడ్జికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జడ్జి ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్, ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, హరియాదవ్, నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా



బోల్తా పడిన వ్యాన్

తిరుమల : తిరుమల శ్రీవారి పాదాలకు వెళ్లే ఘాట్ రోడ్డు మార్గంలో వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈఘటనలో నలుగురు భక్తులకు గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన యమునప్ప, పుష్ప దంపతుల ఆధ్వర్యంలో దాదాపు 20 మంది కుటుంబ సభ్యులు తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం తిరుమలలోని స్థానిక ఆలయాల సందర్శన కోసం ఓ వ్యాను అద్దెకు తీసుకున్నారు. వీరు శ్రీవారి పాదాలు దర్శించుకుని ఘాట్ రోడ్డులో కిందకు దిగుతున్న సమయంలో వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న సుధ(19) తలకు తీవ్రగాయం కాగా మరో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. వ్యాన్ సరైన కండీషన్లో లేదని భక్తులు ఆరోపించారు.

ఓటేద్దాం రండి



తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బంది సందడి

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదివారం విధులకు కేటాయించిన ఉద్యోగులకు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసింది. ఆ మేరకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున జిల్లాలో 2,140 పోలింగ్ కేంద్రాలకు పంపింది. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంది. సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చింది.

- సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సామగ్రి, సిబ్బంది
- రీ పోలింగ్‌కు చాన్స్ లేకుండా ఏర్పాట్లు
- సమస్యాత్మక, అతిసమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యే నిఘా

తిరుపతి అర్బన్: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. కలెక్టరేట్‌లోని మానిటరింగ్ సెల్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ ద్వారా జిల్లాలోని ఎన్నికల కసరత్తును జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు. జిల్లాలో సమస్యాత్మక, అతిసమస్యాత్మక కేంద్రాలపై ఎన్నికల సంఘం, పోలీస్ అధికారులు డేగకన్ను పెట్టారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలను, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పక్క రాష్ట్రాలకు చెందిన పోలీసులు, కేంద్రబలగాలు ఈ ఎన్నికల్లో పహారా కాస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 696 సమస్యాత్మక, 15 అతిసమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, ఆయా కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నియమించారు.



ఈవీఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది

ఓటింగ్ శాతం పెంచేందుకు

ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. 2019లో 78.06 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు అధికారిక యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 18,12,980 మంది ఓటర్లలో సాధ్యమైనంత మంది పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 24,596 మంది దివ్యాంగ ఓటర్లుండగా వారందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.

ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్


సార్వత్రిక ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. దాదాపు ఐదు నెలలుగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం ఈ ఎన్నికల్లో 14,342 మంది అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని అధికారులు వెల్లడించారు. వారంతా ఆదివారం రాత్రి పోలింగ్ కేంద్రాలలోనే బస చేస్తారు. ప్రిసైడింగ్ అధికారులు సోమవారం ఉదయం 5.30 గంటలకు ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలతో మాక్‌పోలింగ్ నిర్వహిస్తారు. తర్వాత కంట్రోల్ యూనిట్‌లోని మెమరీని డిలీట్ చేసి, వీవీప్యాట్ కంటైనర్ బాక్స్ నుంచి మాక్ ఓటింగ్ స్లిప్పులను తొలగిస్తారు.

ఇరకం దీవికి బోటులో తరలివచ్చిన సిబ్బంది

తడ: మండలంలోని ఇరకం, వేనాడు ప్రాంతాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఈ మేరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు.



ఇరకం దీవికి పడవలో వెళ్తున్న సిబ్బంది



జిల్లా సమాచారం...	
ఓటర్లు	18,12,980
సర్వీస్ ఓటర్లు	862 మంది
ఎన్నారై ఓటర్లు	291 మంది
పీడబ్ల్యూడీ ఓటర్లు	24,596
85 ఏళ్లు దాటిన ఓటర్లు	7924
పోలింగ్ స్టేషన్లు	2,140
మోడల్ పోలింగ్ స్టేషన్లు	14
సమస్యలు లేని పోలింగ్ స్టేషన్లు	1,444
సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు	696
వల్నరబుల్పోలింగ్ స్టేషన్లు	15
హోమ్ ఓటింగ్‌తోపాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	22,416

> **ఓటు హక్కు అందరి బాధ్యత**
>
> ఓటు హక్కు ప్రజలందరి బాధ్యతగా భావించాలి. ఓటు వేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి. గత ఐదు నెలలుగా జిల్లా యంత్రాంగం ఎంతో శ్రమించి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాం. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాం. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. – ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎన్నికల అధికారి, తిరుపతి

నియోజకవర్గం-రిటర్నింగ్ ఆఫీసర్లు (ఆర్వోలు)
తిరుపతి పార్లమెంట్‌కు ప్రవీణ్‌కుమార్, కలెక్టరేట్
వెంకటగిరి అసెంబ్లీ హెచ్‌ఎం ధ్యానచంద్ర
తిరుపతి అసెంబ్లీకి అదితి సింగ్
చంద్రగిరి అసెంబ్లీకి ఏ.నిషాంత్‌రెడ్డి
గూడూరు అసెంబ్లీకి కిరణ్‌కుమార్
సూళ్లూరుపేట అసెంబ్లీకి ఆర్.చంద్రముని
శ్రీకాళహస్తి అసెంబ్లీకి ఎస్.రవిశంకర్‌రెడ్డి
సత్యవేడు అసెంబ్లీకి నరసింహులు

జిల్లా సమాచారం

నియోజకవర్గం	ఓటర్లు
గూడూరు	2,45,205
సూళ్లూరుపేట	2,42,610
వెంకటగిరి	2,43,582
చంద్రగిరి	3,15,159
తిరుపతి	3,02,503
శ్రీకాళహస్తి	2,48,536
సత్యవేడు	2,15,385
మొత్తం ఓటర్లు	18,12,980

జిల్లాలో ఎన్నికల బరిలో

నియోజకవర్గం	అభ్యర్థులు
తిరుపతి పార్లమెంట్‌కు	23
తిరుపతి అసెంబ్లీకి	46
చంద్రగిరి అసెంబ్లీకి	24
శ్రీకాళహస్తి అసెంబ్లీకి	15
సత్యవేడు అసెంబ్లీకి	15
గూడూరు అసెంబ్లీకి	14
వెంకటగిరి అసెంబ్లీకి	10
సూళ్లూరుపేట అసెంబ్లీకి	09

వెలుగు సిబ్బందితో ఓటర్లకు నగదు పంపిణీ

శ్రీకాళహస్తి : ఓ రాజకీయ పార్టీ వెలుగు సిబ్బందితో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికిపోయింది. తొట్టంబేడు మండలం, బోనుపల్లికి చెందిన వేణు తొట్టంబేడు వెలుగు కార్యాలయం(వైఎస్‌ఆర్ క్రాంతిపథం)లో సంఘ మిత్రగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన తన స్వగ్రామమైన బోనుపల్లిలో ఓ రాజకీయ పార్టీ తరపున ఓటర్లకు నగదు పంచుతూ స్థానికుల కంట పడ్డాడు. సదరు పార్టీకి ఓట్లు వేయకపోతే డ్వాక్రా రుణాలు ఇవ్వమని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినట్టు తెలిసింది. సంబంధిత సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నగదు పంపిణీ చేస్తున్న వెలుగు సిబ్బంది

కళ్లెదుటే విషాదం

- రైలు ఢీకొని తల్లీకొడుకు దుర్మరణం
- కావలిలో ఘటన

కావలి(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): రైలు ఢీకొని తల్లీకొడుకు మృతి చెందిన ఘటన కావలి రైల్వే స్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. సైదాపురం మండలం చాగణంకు చెందిన ఐసీడీఎస్ ఉద్యోగిని బట్టా సుభాషిణికి (55)కి కావలిలో ఎన్నికల విధులు కేటాయించారు. దీంతో ఆమె తన కుమారుడు విజయ్ (28)ను తోడు తీసుకుని గూడూరు నుంచి కావలి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఉదయం 7.20 గంటల ప్రాంతంలో స్టేషన్ నుంచి బయటకు వచ్చేందుకు ఎగువమార్గం పట్టాలు దాటుతున్నారు. అదే సమయంలో దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు వస్తోంది. చివరి క్షణంలో రైలు గమనించిన విజయ్ తల్లిని కాపాడేందుకు ముందుకు రావడంతో ఇద్దరూ ప్రమాదం బారిన పడ్డారు. దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఎన్నికల విధులకు హాజరైన పలువురు ఉద్యోగులకు సమాచారం తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు అనాలోచితంగా దూర ప్రాంతానికి చెందిన మహిళకు విధులు కేటాయించారని మండిపడ్డారు. రైల్వే పోలీసులు మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

కారు దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని జువ్వలపాళెం గ్రామం వద్ద శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కారు దగ్ధం చేసినట్లు బాధితుడు గాడి తిలక్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితుడు మాట్లాడుతూ శనివారం రాత్రి జువ్వలపాళెం గ్రామంలోని తన ఇంటి ముందు కారు నిలబెట్టినట్లు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద శబ్దం వచ్చి కారు మంటల్లో తగులబడుతుండడాన్ని గుర్తించానన్నారు. ఎవరో తనపై కక్షగట్టి కారు తగలబెట్టారని వాపోయాడు.



దగ్ధమవుతున్న కారు

టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (అలిపిరి) : తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం యూజర్ మాన్యువల్, ఆయా కళాశాలల ప్రాస్పెక్టస్‌ను తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. విద్యార్థులు admission.tirumala.org వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకుంటున్న పోలింగ్ కేంద్రాలు



ముస్తాబైన ఎస్వీ క్యాంపస్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రం

తిరుపతి సిటీ: తిరుపతి నియోజకవర్గ పరిధిలో పలు పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ఆకట్టుకుంటున్నాయి. బాలాజీ కాలనీలోని ఎస్వీ క్యాంపస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో రంగురంగుల బెలూన్‌లతో స్వాగతం పలుకుతున్నాయి. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు తాగునీటి సౌకర్యం, అత్యవసర మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. నగరంలో రెండు మోడల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలు, యువత, దివ్యాంగుల కోసం పద్మావతి మహిళా వర్సిటీలోని హ్యూమనిటీ బ్లాక్‌లోనూ, స్థానిక ఎస్‌డీ లేఅవుట్‌లోని ఎస్‌పీజీఎన్‌ఎమ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఘనంగా భాష్యకారుల సాత్తుమొర



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. శ్రీరామానుజులవారు జన్మించిన వైశాఖ మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం శ్రీ భాష్యకార్ల వారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తరువాత నడకదారిలోని శ్రీ భాష్యకార్ల సన్నిధిలో వైభవంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారిని ఒక తిరుచ్చిపై, శ్రీభాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తరువాత ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహించారు.

పుష్పాభిషేకం



శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారికి పుష్పాభిషేకం చేపడుతున్న అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం పుష్పయాగ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని ఊంజల్ మండపంలో అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి పుష్పయాగం అత్యంత వైభవంగా సాగింది. తులసి, చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, రోజా, తామర, కలువ, మొగలిరేకులు వంటి 11 రకాల పూలు, ఆరు రకాల ఆకులు కలిపి మొత్తం మూడు టన్నుల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు 3 టన్నుల పుష్పాలను విరాళంగా అందించారు. ఈ మహోత్సవాన్ని తిలకించి భక్తులు తన్మయత్వం చెందారు. శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలో పుష్పయాగం చేపట్టారు. మొదటగా అర్చకులు 108 సార్లు విష్ణుగాయత్ర మంత్రాన్ని పఠించి పుష్పాలకు అధిపతి అయిన పుల్లుడు అనే దేవున్ని ప్రసన్నం చేసుకున్నారు. ఇలా చేయడంతో ప్రకృతిమాత పులకించి ఎలాంటి వైపరీత్యాలు తలెత్తకుండా స్వామివారు కరుణిస్తారని నమ్మకం. బ్రహ్మోత్సవాల్లో, నిత్య కైంకర్యాల్లో అర్చక పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల కారణం తెలియక జరిగే లోపాలకు ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాగం నిర్వహణతో సమస్త దోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. పుష్పయాగం అనంతరం రాత్రి 7 గంటలకు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతికి పట్టం కట్టండి

తిరుపతి సిటీ: నేడు జరగనున్న ఎన్నికలలో ప్రజలు పేదల పక్షపాతికి పట్టం కట్టాలని రాష్ట్ర ఓపెన్ మైండ్స్ సొసైటీ మేధావులు పిలుపు నిచ్చారు. ఆదివారం తిరుపతిలో వారు మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వినియోగించుకోవాలని సూచించారు. ఓటు భవిష్యత్‌ను నిర్ణయించే ఆయుధమని, సంక్షేమం, అభివృద్ధిని అడ్డుకునే నిరోధకులకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

గత ఐదేళ్లలో సీఎం జగన్ సుమారు 3 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకులకు వయోపరిమితిని 62 నుంచి 64ఏళ్లకు పెంచారన్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు సూచనలతో 58 ఏళ్ల నుంచి 55కు అధ్యాపకుల వయోపరిమితిని తగ్గించారని గుర్తుచేశారు.

ఉద్యోగులు ఆ సమయంలో చంద్రబాబుపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారన్నారు. చంద్రబాబును ఉద్యోగులు ఎప్పటికీ విశ్వసించరని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు దేశం గర్వించేలా విదేశాలలో జరిగే కాన్ఫరెన్స్‌లకు వెళ్లడం ఇదో చరిత్రగా చెప్పవచ్చన్నారు. మెడికల్ ఎడ్యుకేషన్‌కు పెద్దపీట వేసి 17 మెడికల్ కళాశాలలను కొత్తగా ఏర్పాటు చేసి రాష్ట్రంలో 3వేలకు పైగా సీట్లు పెంచారన్నారు. ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచి ప్రధాన నగరాలలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులలో వైద్య సౌకర్యం లభించేలా అవకాశం కల్పించారన్నారు. మరో ఐదేళ్లు పేదల పక్షపాతి సీఎం జగన్‌కు అండగా నిలవాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో ఓపెన్ మైండ్స్ సొసైటీ మేధావులు ప్రొఫెసర్ వీ.నారాయణరెడ్డి, డాక్టర్ ఎస్.రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఓపెన్ మైండ్స్ సొసైటీ మేధావులు